

ఘనంగా మేడే



ఘట్‌కేసర్‌లో ఎర్రజెండాను ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు



సీఐటీయూ ఆధ్వర్యంలో తాండూరులో ర్యాలీ


కార్మిక దినోత్సవం మేడేను కార్మికులు బుధవారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో వాడవాడలా జరుపుకున్నారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కూడళ్లు, పరిశ్రమల వద్ద జెండాలను ఆవిష్కరించారు. భారీ ర్యాలీలు నిర్వహించారు. తమ హక్కుల సాధనకు కార్మిక సంఘాలు చేపట్టిన పోరాటాలు.. సాధించిన విజయాల గురించి సంఘాల నాయకులు గుర్తు చేశారు.



పూడూరులో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న కార్మికులు

ఎన్నికల ప్రచారానికి ఎండదెబ్బ!

మధ్యాహ్నం వేళల్లో విరామం



లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఎండదెబ్బ అడ్డంకిగా మారింది. ఒకవైపు ప్రచార గడువు ముంచుకొస్తుంటే, మరోవైపు రోజు రోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత అభ్యర్థులకు, పార్టీల నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఎండ తీవ్రత ఉండడంతో ప్రచారం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. దీంతో దిక్కుతోచక పార్టీల ముఖ్య నేతలు తలపట్టుకుంటున్నారు.

- ఉదయం..సాయంత్రం వేళల్లోనే ప్రచారం..
- ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరవుతున్న కార్యకర్తలు
- ప్రచారానికి ఇంకా పదిరోజులే గడువు

ముంచుకొస్తున్న ప్రచార గడువు

ఇదిలా ఉంటే, ఎన్నికల ప్రచార గడువు ముంచుకొస్తోంది. ఈనెల 13వ తేదీన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, 11వతేదీ, సాయంత్రం 5 గంటలకు ప్రచారం గడువు ముగియనుంది. ఎన్నికల ప్రచారానికి ఇంకా పది రోజులు మాత్రమే గడువు ఉంది. ఒక వైపు ప్రచారానికి తక్కువ సమయం ఉండడం, మరో వైపు ఎండలు మండిపోవడంతో ఏమి చేయాలో తోచక ప్రధాన పార్టీల ముఖ్య నేతలు తలపట్టుకుంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లను ఏ విధంగా కలువగలుతామనే విషయమ్మై దృష్టి సారించారు. ఎండ తీవ్రత ఉండే మధ్యాహ్నం మినహాయించి ఉదయం, సాయంత్రం వేళల్లో నాయకులు, కార్యకర్తలను బృందాలుగా ఏర్పాటు చేసి ఇంటింటి ప్రచారం చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.



ఆంధ్రజ్యోతి, వికారాబాద్, మే1: ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తుండడంతో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు నాయకులు ముందుకు రావడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు మండిపోతుండడంతో లోక్‌సభ ఎన్నికల ప్రచారం అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. మధ్యాహ్న సమయంలో ఇటీవల ఎండలను లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించిన కొందరు నాయకులు అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలయ్యారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు కూడా అదే సమయంలో నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం ఇంటింటి ప్రచార కార్యక్రమాలకు విరామం ఇస్తున్నారు. ఆ సమయంలో హాల్ మీటింగులు నిర్వహిస్తున్నారు. తమకు మద్దతుగా నిలుస్తున్న వారితో సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎండల తీవ్రతను గుర్తించిన ప్రధాన పార్టీల ముఖ్యనేతలు క్షేత్రస్థాయిలో కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా వారు నడుచుకుంటున్నారు. ఎండలను లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే ఏదైనా జరగరాని సంఘటన చోటు చేసుకుంటే తమకు ఎవరు అండగా ఉంటారంటూ అక్కడక్కడ కొందరు కార్యకర్తలు తమ నాయకులను నిలదీయడంతో పార్టీలు కూడా వారి అభిప్రాయాలకు తగ్గట్టుగా నడుచుకుంటున్నాయి.



అప్పటి జోష్ ఏదీ ?

గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తల్లో జోరు, ఉత్సాహం, సందడి కనిపించడం లేదు. పార్టీల అభ్యర్థులు, ముఖ్య నేతలు వచ్చినప్పుడు మాత్రమే నాయకులు, కార్యకర్తలు కనిపిస్తున్నారు. నాయకుల ముందు కనిపించే ఎన్నికల ప్రచార సందడి వారు వెళ్లిన తరువాత కనిపించకుండా పోతోంది. ఈ తీరు ప్రధాన పార్టీల్లో కనిపిస్తోంది. ఇంతకు ముందు ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే గ్రామాలు, పట్టణాల్లో రాజకీయ సందడి కనిపించేది. ఎక్కడ నలుగురు కలిసినా రాజకీయ పార్టీలు, అభ్యర్థుల గురించే చర్చ జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. తమను పలకరించకపోయినా, తమను తక్కువ చేసి చూస్తున్నట్లు అనిపించినా అలిగి ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇలాంటి వారిని సమన్వం చేసుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించడమనేది పార్టీలకు సవాల్‌గా మారుతోంది.

ఆసక్తి చూపని ఓటర్లు

ముఖ్య నేతలు బతిమిలాడితేనే నాయకులు, కార్యకర్తలు ప్రచారానికి వస్తున్నారంటే అతిశయోక్తి కాదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి తమకే ఓటు వేయాలని ఓటర్లను స్వయంగా అభ్యర్థించారు. అభ్యర్థులు తమ గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన తరువాత కూడా స్థానిక నాయకులు, కార్యకర్తలు ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించే ప్రచారంతో ఎక్కువ మందిని కలవలేకపోతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే పట్టణాలు, గ్రామాల్లోకి ప్రచార రథాలు వస్తున్నా జనం అంతగా ఆసక్తి కనబరచడం లేదు. ఇంతకు ముందు తమ గ్రామాలు, తండాలకు ఎన్నికల ప్రచార వాహనాలు వస్తే ప్రజలు ఎంతో ఆసక్తిగా గమనించేవారు. మైక్‌ల్లో వినిపించే రికార్డు చేసిన ప్రసంగాలను వినేవారు. ఏ పార్టీ ఏమి చెబుతున్నదనేది గుర్తించేవారు. పార్టీలు చెప్పే అంశాలు, హామీలపైన చర్చ చేసేవారు. ఈ ఎన్నికల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఓటర్లను ఆకట్టుకునేందుకు పాటలు పడుతూ, ప్రదర్శనలు ఇస్తున్నా ప్రజలు అంతగా ఆసక్తి చూపడం లేదు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



ఈవీఎం మిషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మే1: పార్లమెంట్ ఎన్నికలలో వినియోగించే ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవో, ఏపీవో, ఓపీవోల శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు.అనంతరం మాట్లాడుతూ. శిక్షణ పొందిన అధికారులు ఎన్నికలను నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. పోలింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవో, ఓపీవోల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈవీఎంల కనెక్ట్ నుంచి వాటిని వాడే విధానంపై పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొత్తం 250 మంది ఉద్యోగులకు గాను 231 మంది శిక్షణా తరగతులకు హాజరయ్యారని, 19 మంది గైర్హాజరయ్యారని, వారికి మెమో లు అందజేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైయినీ కలెక్టర్ ఉమాహారతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు రెండు వేల బ్యాలెట్ యూనిట్స్

జిల్లాకు అదనంగా కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం) ఫస్ట్ లెవెల్ చెకింగ్ కొనసాగుతున్న ప్రక్రియను ట్రైయినీ కలెక్టర్ ఉమాహారతితో కలిసి కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. జిల్లాకు అదనంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లు, బ్యాలెట్ యూనిట్స్ రెండు వేలు వచ్చాయని, రెండు రోజుల్లో ఈవీఎంల తనిఖీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఓటింగ్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రతలు తీసుకోవాలన్నారు.

భద్రేశ్వరుడికి భక్త నీరాజనం

- వైభవంగా స్వామివారి రథోత్సవం
- ఆకట్టుకున్న పురంతయ్యల విన్యాసాలు

తాండూరు, మే1: భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం భద్రేశ్వరుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అర్థరాత్రి వరకు భద్రేశ్వరస్వామి వారిని ప్రత్యేక రథంపై ఊరేగించారు. ఆలయం నుండి గాంధీచౌక్ , రాచన్న దేవాలయం వరకు సంకీర్తనలు, పురంతయ్యల విన్యాసాల నడుమ ఊరేగింపు కొనసాగింది. దారి పొడవునా భక్తులు స్వామి వారికి టెంకాయలు, పువ్వులు, సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారు జామున రెండున్నర గంటలకు స్వామి వారు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. నగేశ్వర దేవస్థాన భజన మండలి, నగేశ్వర సేవా సమితిల ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, మంచినీటి సదుపాయాన్ని కల్పించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, జీవన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఊరేగింపు జరిగే ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. అంతకు ముందు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్ లావణ్యలు రథానికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు సడ్డి భద్రప్ప, వాలిశాంత్‌కుమార్, గాజుల శాంత్‌కుమార్, జొన్నల బస్వరాజ్, ఆలయ ఈవో శేఖర్ గౌడ్, పాల్గొన్నారు.



రథంపై ఊరేగితున్న భద్రేశ్వరస్వామి

కల సాకారమయ్యేనా!

గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు ఎప్పుడో?

- ఎన్నికల సమయంలో నేతల హామీలు..
- కార్యసాధనలో విఫలం ...
- గత 20 ఏళ్లుగా అదేతీరు..
- స్పీకర్, సీఎంపైనే జిల్లా విద్యార్థుల ఆశలు



వికారాబాద్, మే1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కొనసాగినప్పటి నుంచి వికారాబాద్ ప్రాంతంలో గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతం విద్యార్థులు గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎన్నికల సమయంలో మాత్రం గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటును తమ ప్రచారాస్త్రంగా రాజకీయ పార్టీలు వినియోగించుకుంటున్నాయి. ప్రతి ఐదేళ్లకోసారి వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు తమ పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటున్నా తామిచ్చిన హామీలు కార్యరూపం దాల్చేలా మాత్రం కృషి చేయడం లేదు. ఎన్నికైన వారు మాత్రం తాము తామ హామీని కార్యరూపం దాల్చే విధంగా ప్రయత్నాలు చేయకుండా విస్మరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్నా.. వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ పరంగా ఉన్నత చదువులు అందించే విద్యా సంస్థలు లేక జిల్లా విద్యార్థులు ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువులు కొనసాగించాల్సి వస్తోంది. పీజీ చదవాలనే కోరిక ఉన్న విద్యార్థులు ఉన్నత చదువుల కోసం హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్, వరంగల్ వంటి పట్టణాలకు, లేదా పీజీ కోర్సులు అందుబాటులో ఉన్న పట్టణాలకో వెళ్లాల్సి వస్తోంది.

జిల్లాలో 16డిగ్రీ కళాశాలలు

జిల్లాలో 16డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. డిగ్రీ కళాశాలల్లో 4 ప్రభుత్వ కళాశాలలు, ఒక ఎయిడెడ్, మిగతా 11 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ప్రతిఏటా రెండున్నర వేల మంది విద్యార్థుల వరకు డిగ్రీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. డిగ్రీ చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులు పీజీ, బీఎడ్, లా, మేనేజ్‌మెంట్ కోర్సులవైపు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. అయితే డిమాండ్ ఎక్కువగా ఉండి.. విద్యార్థులకు ఆసక్తి ఉన్న కోర్సుల్లో సీట్లు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

విశ్వవిద్యాలయం ఏర్పాటైతే..

విశ్వవిద్యాలయం ఏర్పాటైతే సైన్స్ ఆర్ట్స్, సోషల్, కామర్స్, మేనేజ్‌మెంట్, లా, ఎడ్యుకేషన్ రంగాలకు సంబంధించిన కోర్సులు అందుబాటులో ఉంటాయి. యూనివర్సిటీ ఏర్పాటైతే విద్యార్థులకు హాస్టళ్లు అందుబాటులో ఉంటాయి. ఫలితంగా వారు తమ చదువుల పైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించడానికి అవకాశం ఉంటుంది. ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉండి నాణ్యమైన విద్యా బోధన జరుగుతుంది. అంతే కాకుండా యూనివర్సిటీ ఉంటే, ఎంఫిల్, పీహెచ్‌డీ వంటి కోర్సుల్లో కూడా చేరడానికి వీలుంటుంది. విద్యార్థులు తమ భవిష్యత్తును ఏ విధంగా తీర్చిదిద్దుకోవాలనే విషయమ్మై సూచనలు, సలహాలు అందజేసే కేరీర్ గైడెన్స్ సెంటర్ కూడా అందుబాటులో ఉంటుంది. సొంత జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటైతే దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే చదువుకునే అవకాశం ఉంటుంది.స్థానికంగా తాము చదవాలనుకున్న పీజీ కోర్సులు అందుబాటులో లేక.. దూర ప్రాంతాలకు వెళ్లి చదవడానికి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించక విద్యార్థులు కొందరు తమ చదువులను డిగ్రీతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. పీజీ చదవాలనే కోరిక ఉన్నా స్థానికంగా ఆ అవకాశం లేక అమ్మాయిలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు.

స్పీకర్, సీఎంపైనే ఆశలు

గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటుపై జిల్లా వాసులు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆశలు పెట్టుకున్నారు. వికారాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్, సీఎం గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించి కార్యరూపం దాల్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. గ్రామీణ విశ్వవిద్యాలయంఏర్పాటైతే ఉన్నత చదువులను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఎన్నికల సమయంలోనే నేతల నోట...

వికారాబాద్‌లో గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనే డిమాండ్ గత 20 ఏళ్లుగా ఉంది. ఎన్నికల సమయంలోనే ఈ హామీ తెరపైకి వస్తోంది. ఎన్నికలు ముగియగానే ఈహామీ తెర వెనక్కు వెళ్లిపోతోంది. ఎన్నికల్లో గెలిచిన వారు ఈ హామీని నిలబెట్టుకోవడానికి సరైన తీరులో కృషి చేయని కారణంగానే జిల్లాలో ఇంత వరకు గ్రామీణ విశ్వవిద్యాలయానికి నోచుకోలేకపోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని రకాల ఉన్నత చదువులు లభ్యమయ్యే విధంగా వికారాబాద్‌లో గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే జిల్లా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు కావాలంటే జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు సంఘటితంగా కృషి చేయాల్సి ఉంటుంది. గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు వస్తేనే ఈ ఆకాంక్ష సాకారమవుతుంది. గత 20 ఏళ్లుగా నేతల ప్రకటనలకే పరిమితమవుతున్న ఈ హామీ సాకారమైతే జిల్లా విద్యార్థులకు స్థానికంగానే ఉన్నత చదువులు చదివే యోగం కలుగుతుంది.

కొత్త టెక్నాలజీతో సిమెంటు ఉత్పత్తులు పెంచాలి

- సీఎండీకి వినతిపత్రం అందజేసిన ఉద్యోగులు

తాండూరురూరల్, మే 1 : తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామ శివారులోని సీసీఐ కర్మాగారంలో పాత టెక్నాలజీతోనే సిమెంటు ఉత్పత్తులు కొనసాగుతున్నాయని, వాటి స్థానంలో కొత్త టెక్నాలజీని ఉపయోగించి ఉత్పత్తులు పెంచేలా చర్యలు చేపట్టాలని సీసీఐ ఉద్యోగులు సీఎండీ సంజయ్‌బంగాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. సీసీఐ కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎండీ సంజయ్‌బంగాను కలిసి కర్మాగారంలో 45మంది ఉద్యోగులకు గ్రేడ్ ప్రమోషన్ కల్పించేలా చర్యలు చేపట్టాలని, మరికొంతమంది ఉద్యోగులకుపదోన్నతులు కల్పించాలని కోరారు. సీసీఐలో కొత్త టెక్నాలజీ ఏర్పాటు కోసం రూ.45కోట్ల నిధులను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సీఎండీ సంజయ్‌బంగా స్పందిస్తూ కొత్త టెక్నాలజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి కేంద్ర సీసీఐ కర్మాగారాల సీఎండీకి నివేదిక అందించాలని అక్కడే ఉన్న సీసీఐ సీఎండీ మహానాను ఆదేశించారు. పరిశీలించాకనే ప్రమోషన్లపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, చైతన్య, రవికిరన్, సురేష్, పర్సనల్ మేనేజర్ అమిత్‌రంజన్ ఉన్నారు,



సంజయ్‌బంగాతో మాట్లాడుతున్న ఉద్యోగులు

ఎంబీఏ పూర్తి చేసుకున్న విద్యార్థులకు
మంచి ప్లేస్‌మెంట్లు



ప్రశంసలందుకుంటున్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, మే 1 : ఎంబీఏ పూర్తిచేసుకున్న విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్లు అందేలా తమ యూనివర్సిటీ పనిచేస్తుందని మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ వీఎస్‌కే.రెడ్డి అన్నారు. బుధవారం సన్‌స్టోన్ సంస్థ సహకారంతో ఎంబీఏ సూపర్ అచీవర్స్ కార్యక్రమం పేరిట క్లాస్ ఆఫ్-2024 ప్లేస్ మెంట్లకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం నిర్వహించారు. వీ సీ వీఎస్‌కే.రెడ్డి మాట్లాడుతూ సన్‌స్టోన్ సంస్థ సహకారంతో తమ యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్ వచ్చేలా తీర్చి దిద్దుతున్నామన్నారు. ఎంబీఏ చదివిన ప్రతి విద్యార్థి మంచి ఉద్యో గాలు పొందేలా పలు వ్యాపార, వాణిజ్య సంస్థలతో ఒప్పందం కుదుర్చు కున్నామని తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు

వికారాబాద్, మే 1 : బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి జ్యోతి పద్మ అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ సంయుక్తంగా బాల్య వివాహాల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారి జ్యోతిపద్మ మాట్లాడుతూ.. ఈ నెలలో వచ్చే అక్షయ తృతీయ సందర్భంగా ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లుగా సమాచారం ఉంటే ముందస్తుగా టీచర్లు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో ఉండే ప్రజలు, పూజారులు, ఖాజీలు,పాస్టర్లు, పెళ్లి జరిగే ఫంక్షన్ హాల్ యజమానులు జిల్లాలోని డీసీపీయూ అధికారులకు లేదా చైల్డ్‌లైన్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఒకవేళ బాల్య వివాహానికి కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు ఎవరైనా సహకరించినా అలాంటి చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే ఐసిడిఎస్, మిషన్ వాత్సల్య సిబ్బంది బాల్య వివాహాల నిర్మూలనకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామాలు, తండాల్లో బాల్య వివాహాలు అరికట్టేందుకు బాల్యవివాహ నిరోధక అధికారులకు, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖ అధికారుల, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. సమావేశానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు శ్రీకాంత్, ఆంజనేయులు, చైల్డ్‌లైన్ ప్రతినిధి రాజునాయక్, హబ్బు కోఆర్డినేటర్ బలరాంనాయక్, సఖి ప్రతినిధి యశోద, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వెల్ఫేర్ అధికారి జ్యోతి పద్మ

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలిగించొద్దు

బొంరాస్‌పేట్, మే 1: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా అధికారి గోపాల్, ఏడీఏ శంకర్‌రాథోడ్ అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంటలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. తేమ శాతాన్ని పరిశీలించి తేమ ఉన్న వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ధాన్యాన్ని తూర్పార చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో భార్గవి, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఏవో

నంబిగురు మఠాన్ని పరిశీలించిన తహసీల్దార్

నవాబుపేట, మే 1: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో గల నంబి గురుస్వామి ఆలయ ఆవరణలో జరుగుతున్న పనులపై ఇరువర్గాలు ఫిర్యాదుతో బుధవారం తహసీల్దార్ జానకీరామ్ ఆ పరిసరాలను పరిశీలించారు. ఆలయ భూ వివరాలను తెలుసుకున్నారు. అక్కడ చేపడుతున్న పనులపై ఫిర్యాదు రావడంతో పరిశీలన చేశామన్నారు. తిమ్మారెడ్డిపల్లి, చిట్టిగిద్ద వాసులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్



పంట పొలాల్లో ఆనవాళ్లను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

అన్నారం శివారులో పులి సంచారంపై వదంతులు

ఆనవాళ్లు పరిశీలించిన ఫారెస్టు అధికారులు

కొడంగల్, మే 1: అటవీ ప్రాంత సమీప పొలాల్లో పులి సంచరిస్తోందనే వదంతులు ఆందోళన కలిగిస్తున్నాయి. అన్నారం శివారులోని మాడమీదిపల్లి ఆంజనేయస్వామి అటవీ ప్రాంతంలో వారం రోజులుగా పులి తిరుగుతోందని ప్రచారం కలకలం రేపుతోంది. బుధవారం మేకను కరుచుకొని పోయిందని గ్రామస్తులు భయాందోళనతో మాజీ సర్పంచ్ అనితాపకీరప్పకు తెలిపారు. ఆమె జిల్లా ఫారెస్టు అధికారి జ్ఞానేశ్వర్‌కు సమాచారమిచ్చారు. కొడంగల్ ఫారెస్టు అధికారులు ఫరూక్‌అలీ, రాజు, రాములు సిబ్బంది అన్నారం పొలాల్లో ఆనవాళ్లను పులి కాలి గుర్తులను పరిశీలించారు. ఇక్కడ దట్టమైన పొదలు ఉండటంతో పులి సంచరించే ఆస్కారం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవలే దౌల్తాబాద్ మండలం చల్లాపూర్‌లో పులి సంచారాన్ని గుర్తించినట్లు చెప్పారు. వేసవిలో వన్యప్రాణులు తాగునీరు, ఆహారం కోసం పొలాల వద్దకు రావడం సహజం అని తెలిపారు.

ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యం



తాండూరు : సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరురూరల్, మే 1 : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని. ప్రజలు కేసీఆర్‌ను నమ్మడం లేదని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయడం సాధ్యం కాదన్నారు. బుధవారం తాండూరు మండలం గోనూరు ఎంపీటీసీ నర్సమ్మ, మాజీ సర్పంచ్ గోవింద్‌లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి విశ్వేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీలో చేరారు. అదే విధంగా గోనూరు, వీరశెట్టిపల్లికి చెందిన ఎర్ర శ్రీనివాస్, రాజు, భీంరెడ్డి, రాంరెడ్డి, నర్సింహా, పరుశురాం, ఎర్ర శ్రీశైలం, చీమల హరి, శంకర్, మల్లప్ప, మల్లేశం, బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్‌కుమార్, గౌతాపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, నాయకులు బొప్పి శ్రీహరి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిక

మండల పరిధిలోని చంద్రవంచ గ్రామంలో కాంగ్రెస్‌కు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డితోపాటు కొంతమంది యువకులు బీజేపీలో చేరారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరగా ఆయన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలను సరిగ్గా పట్టించుకోవడం లేదని విజయ్‌కుమార్ ఆరోపించారు.

మేడే వేడుకల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు : తాండూరు మార్కెట్‌లో నిర్వహించిన ప్రపంచ కార్మిక దిన వేడుకల్లో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. మాట్లాడుతూ మేడే వేడుకలను కార్మికుల సమక్షంలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మార్కెట్‌లోని వర్తక సంఘం, హమాలీ సంఘం సభ్యులతో ముచ్చటించారు. కార్మికుల సంక్షేమం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. త్వరలో ప్రపంచ ఆర్థిక రంగంలో భారత ఆర్థిక వ్యవస్థ మూడో స్థానాన్ని ఆక్రమిస్తుందని కొండా ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తాండూరులో జరిగిన వీరశైవ సమాజ్ ఆత్మీయ సమ్మేళనంలో విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. బసవేశ్వరుడు సమాజంలోని అంతరాలను ప్రశ్నించిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గం.. నడవడిక మేటి నాయకులకు మార్గదర్శకమని తెలిపారు. ఆయన ఆదర్శంగా తీసుకొని సమాజంలో మార్పుకోసం ప్రతి ఒక్కరు సేవా మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. వీరశైవ సమాజ్ అధ్యక్షుడు బస్వరాజ్ ఆధ్వర్యంలో 200 మంది సభ్యులు బీజేపీలో చేరారు.

చేవెళ్ల ఎంపీగా కొండాను గెలిపించాలి

మహేశ్వరం/మొయినాబాద్ రూరల్/చేవెళ్ల/షాబాద్ : తుక్కుగూడ ప్రజలు చేవెళ్ల ఎంపీగా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తుక్కుగూడ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ కోరారు. మున్సిపల్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాగా, మోదీ పాలనలో మచ్చుకైనా అవినీతి లేదని భూతద్దం, మైక్రోస్కోప్ పెట్టి చూసినా ఎవరూ ఏమీ చేయలేకపోయారని కాంగ్రెస్ నాయకులపై బీజేపీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు గున్నాల గోపాల్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం హిమాయత్ నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ వాళ్లు, కుల రిజర్వేషన్ రద్దు నినాదం ఎత్తుకున్నారని, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంత నినాదం ఎత్తుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డిలు మండలంలోని అల్లావాడ, జలాగూడలో విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. దేశ ప్రగతి మోదీతోనే సాధ్యమౌతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ రెడ్డి అన్నారు. షాబాద్ మండలం అప్పారెడ్డిగూడ, నరేడ్లగూడ, దామర్లపల్లి, నాందార్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వినర్ రాము, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు మహేష్‌లతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు.

విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుతో అభివృద్ధి సాధ్యం

మోమిన్‌పేట్/ధారూరు/మర్పల్లి/వికారాబాద్/కులకచర్ల/బషీరాబాద్ : విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుతో తెలంగాణ అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ మోమిన్‌పేట మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు ఆశిరెడ్డి అన్నారు. గోవిందపూర్, చక్రంపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ధారూరులోని వివిధ కాలనీల్లో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీకి ఓటు వేసేందుకు ప్రజలు పూర్తి విశ్వాసంతో మద్దతు తెలుపుతున్నారని జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. మర్పల్లి మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. దేశం కోసం, ధర్మం కోసం బీజేపీకి ఓటువేసి గెలిపించాలని బీజేపీ జిల్లా నాయకులు రాజేందర్ రెడ్డి, బుస్సా శ్రీకాంత్ అన్నారు. వికారాబాద్ పట్టణంలోని ఇందిరానగర్, అంబేడ్కర్ కాలనీల్లో ప్రచారం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పాల్గొన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ నాయకులు కులకచర్లలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. బషీరాబాద్ మండలం జీవన్గి, బద్లాపూర్, బద్లాపూర్‌తండాలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి పలువురు యువకులు, నాయకులు, కార్యకర్తలు తాండూరులో విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో దాదాపు 50 మంది బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉప్పరి రామేష్ కుమార్, జిల్లా కార్యదర్శి గంగాధర్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, ఏప్రిల్ 11: ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వికారాబాద్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించే ప్రచారం నిర్వహించుకోవాలన్నారు. ప్రజలు అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఎం పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీటీ అనిత పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటా

మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్



మచ్చబొల్లారం : మచ్చబొల్లారంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మచ్చబొల్లారం, మే 1 : బడుగు, బలహీనవర్గాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని వీబీఆర్ గార్డెన్‌లో బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో ఈసారి బీజేపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అనంతరం ఎస్సీ మోర్చా నాయకులు ఈటలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి క్రాంతికిరణ్, మేడ్చల్ జిల్లా ఎస్సీ మోర్చా నాయకుడు మురళి, కరుణాకర్, లవ్‌కుమార్, నాగరాజు, రమేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నేను పక్కా లోకల్ : ఈటల

ఏఎస్‌రావునగర్ : నేను పక్కా లోకల్ అని, ఇక్కడే పుట్టిపెరిగానని ఈటల రాజేందర్ అన్నారు. ఏఎస్‌రావునగర్‌లో బుధవారం ఫోరం ఫర్ ఇంప్రూవింగ్ థింగ్స్(ఎఫ్ఐటి)ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన లోక్‌సత్తా పార్టీ నాయకుడు జయప్రకాష్ నారాయణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ మోదీకి ముచ్చటగా మూడోసారి ఓటు వేయాలని దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందని తెలిపారు. దేశంలో గతంలో ఎప్పుడూ సంకీర్ణ ప్రభుత్వాలే ఉండేవని, గత పదేళ్ల నుంచి స్థిరమైన ప్రభుత్వం ఉందని అన్నారు. ప్రధాని మోదీ వ్యక్తి కాదని ఒక శక్తి అని పేర్కొన్నారు. దేశంలో రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకుంటున్నాయని ఈటల తెలిపారు. లోక్‌సత్తా నాయకుడు జయప్రకాష్‌నారాయణ వంటి వారు ప్రధాని మోదీని బలపరచడం అభినందనీయమన్నారు. అచ్చమైన తెలంగాణ బిడ్డనైన నన్ను ఇతర పార్టీల వారు ఎక్కడి నుంచి వచ్చావని ప్రశ్నిస్తున్నారని నేను పక్కా లోకల్ అని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని ఈటల కోరారు. సమావేశంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజేందర్‌ను మెజారిటీతో గెలిపించాలి

రామంతాపూర్/నిజాంపేట్/షాపూర్‌నగర్/మౌలాలి/మేడ్చల్ : ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ రామంతాపూర్ డివిజన్ పరిధిలోని 254, 255, 256 బూత్‌ల అధ్యక్షులు, కో-ఆర్డినేటర్లు రేవు నర్సింహ కురుమ, బుర్ర రాజేశ్వర్, బొడ్డుపల్లి ఆనంద్, గుండె భిక్షపతిల ఆధ్వర్యంలో పాత రామంతాపూర్‌లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ దేశంలో నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి ఓటర్లకు వివరించి ఈటలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే హబ్సిగూడ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఈటలకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. అలాగే నిజాంపేట్ కార్పొరేషన్‌లోని మధురానగర్, బాచుపల్లి కౌసల్యా కాలనీల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాపు సంఘ నాయకులు బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్, బీజేపీ నాయకులు చక్రధర్‌ల ఆధ్వర్యంలో ఈటల సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే ఈటల రాజేందర్ సూరారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని సంజయ్‌గాంధీనగర్, శ్రీకృష్ణనగర్, మార్కెండేయనగర్, నెహ్రూ నగర్‌లోను ప్రచారం చేశారు. గాజులరామారం డివిజన్‌లోని ఉషోదయ కాలనీ కమ్యూనిటీ హాల్లో బీజేపీ నాయకులతో కలిసి ఈటల సమావేశమయ్యారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. కాగా, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేసి వృథా చేయవద్దని ఈటల సూచించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని మల్కాజిగిరి, వినాయకనగర్, మౌలాలి డివిజన్‌లలోని కేశవ్‌నగర్ నుంచి వినాయకనగర్ చౌరస్తా మీదుగా సంతోష్‌మాతనగర్ చౌరస్తా నుంచి ఓల్డ్ సఫీల్‌గూడ వరకు రోడ్‌షో నిర్వహించారు. కార్పొరేటర్‌లు తదితరులు పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల సమక్షంలో మేడ్చల్ మండలం సోమారానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. నారెడ్డి నందారెడ్డి, మాజీ జడ్పీటీసీ శైలజాహరినాథ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పార్టీలో చేరారు.

ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు

చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



శంకర్‌పల్లి : మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

శంకర్‌పల్లి, మే 1: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తుందని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మండలలో నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ విశ్వేశ్వర్‌రెడ్డి ఐదేళ్లకోసారి ఎన్నికల్లో విహారయాత్రకు వస్తూ పోతుంటారని, తర్వాత ప్రజలను పట్టించుకోరని అన్నారు. తాను ఎంపీగా ఐదేళ్లు చేవెళ్ల పరిధిలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారన్నారు. తనపై విశ్వేశ్వర్‌రెడ్డి యేసిన ఆరోపణలు సత్యదూరం అన్నారు. అంతకుముందు వివిధ పార్టీల నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేశారు. చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఉదయ్‌మోహన్ రెడ్డి, మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

చేవెళ్ల/షాబాద్/మొయినాబాద్ రూరల్/మహేశ్వరం/కందుకూరు/రాజేంద్రనగర్/ఎల్బీనగర్/హైదర్‌నగర్: చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చేవెళ్ల మండలం కందవాడకు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శేరి పెంటారెడ్డి, రంజిత్‌రెడ్డిల ఆధ్వర్యంలో సీఎం క్యాంప్ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. షాబాద్ మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రవీందర్‌రెడ్డి కూడా పార్టీలో చేరారు. మండల బీఆర్ఎస్ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి 50మందితో కలిసి రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మహేశ్వరాన్ని కాంగ్రెస్‌కు అడ్డాగా మార్చి పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి నేరెళ్ల శారద అన్నారు. తుమ్మలూరు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వారి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి కందుకూరు మండలం మీర్కాన్‌పేట, ఆకులమైలారంలో, బొక్క జంగారెడ్డి బేగంపేటలో ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డిసతీమణి సీతారెడ్డి కోరారు. మే డేను పురస్కరించుకుని కాటేదాన్ టీఎల్ఎం గార్డెన్‌లో ఏఐటీయూసీ నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అలాగే సీతా రంజిత్‌రెడ్డి సరూర్‌నగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. భగత్‌సింగ్‌నగర్‌లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు.

తాండూరు అభివృద్ధి బాధ్యత నాది

తాండూరు రూరల్/బషీరాబాద్/ధారూరు/పెద్దేముల్/బంట్వారం/కులకచర్ల/మర్పల్లి/వికారాబాద్/నవాబుపేట/యాలాల : తాండూరు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో తాను ఎమ్మెల్యేగా గెలిచానని, తాండూరు అభివృద్ధి బాధ్యత తనదని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు మండలం దస్తగిరిపేట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రంజిత్‌రెడ్డి గెలుపు కోసం చేతిగుర్తుపై ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యం అన్నారు. బషీరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశంలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సేవాకార్యక్రమాలు చేపడుతున్నారని గుర్తుచేశారు. మైల్వార్‌లో 200 మంది వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సోదరుడు సత్యనారాయణ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సోంపల్లి బిచ్చిరెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి సత్తార్ పాల్గొన్నారు. ధారూరు కాంగ్రెస్ నాయకులు ఉపాధి కూలీలను కలిసి చేతి గుర్తుకు ఓటేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బుజ్జయ్యగౌడ్, బాబాఖాన్, కిరణ్‌కుమార్, ముజాఫర్, అంజయ్య, రవీందర్, దావూద్, లక్ష్మయ్య పాల్గొన్నారు. ఈ నెల 6న వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే మైనార్టీల సమావేశానికి ముస్లింలు తరలిరావాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆయ్యూబ్ అన్సారీ తెలిపారు. మండల గ్రామాల్లో పర్యటించి ముస్లింలతో సమావేశమయ్యారు. పెద్దేముల్ మండల కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. జడ్పీటీసీ ధారాసింగ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, డీవై.నర్సిములు పెద్దేముల్ పెద్దచెరువు వద్ద కూలీలతో మాట్లాడి చేతిగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రతొక్కరూ కాంగ్రెస్‌కే ఓటువేయాలని బంట్వారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచారం వెంకటేశం అన్నారు. యాచారంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హరీశ్వర్‌రెడ్డి, యాదగిరి, వెంకటయ్య, తౌఫీక్‌పాషా, హర్షవర్ధన్‌రెడ్డి, అజీం, శ్రీనివాస్, ఇసాక్, వెంకటేశం, శంకర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. ముజాహిద్‌పూర్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఖాయమని మర్పల్లి కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణంలో ప్రచారం నిర్వహించారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి వేల కోట్లు కేటాయిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మామీ ఇచ్చారని వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. మద్గుల్ చిట్టంపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముత్తహర్‌షరీఫ్, మల్లయ్య పాల్గొన్నారు. నవాబుపేట మండలం చించల్‌పేట్ మాజీ సర్పంచ్ కాలె శ్రీనివాస్, మరి కొందరు రంజిత్‌రెడ్డి, భీం భరత్‌ల సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ ఎక్బాల్, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కొండల్‌యాదవ్, ఉపేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీధర్, సంగారెడ్డి పాల్గొన్నారు. 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని యాలాల మండలం అన్నాసాగర్‌కు కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.


పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో కార్మికులను సన్మానిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు

వాడవాడలా మేడే వేడుక

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను బుధవారం కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని పలు పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులు ఫాక్టరీలు, కార్మిక సంఘాల కార్యాలయాల వద్ద ఎర్ర జెండాను ఎగరవేశారు. పలుచోట్ల సంఘాల నేతలు సమావేశాలు నిర్వహించి మేడే విశిష్టతను వివరించారు. కార్మికులు స్వీట్లు పంచుకొని ఉత్సాహంగా గడిపారు.


తాండూరులో మే డే ఉత్సవాల్లో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయలక్ష్మీ పండిత్


కులకచర్లలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరణ


మేడ్చల్ టౌన్ : గుండ్లపోచంపల్లిలో జెండాఎగుర వేస్తున్న పారిశుధ్య కార్మికులు


శామీర్‌పేట పంచాయతీ వద్ద మే డే వేడుకల్లో పాల్గొన్న కార్మికులు


పరిగిలో జెండాను ఎగరవేస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య


కొడంగల్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య


ఘట్‌కేసర్ రూరల్: అవుషాపూర్‌లో మే డే సందర్భంగా జెండాను ఆవిష్కరిస్తున్న పంచాయతీ కార్మికులు, వేడుకలో పాల్గొన్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి


కొడంగల్ రూరల్: మే డే దినోత్సవంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు



కీసరలో మే డే వేడుకలు నిర్వహిస్తున్న కార్మికులు


బొంరాస్‌పేట్‌లో సీఐటీయూ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు. కార్మికులు



మర్పల్లి సబ్‌స్టేషన్‌లోలో కార్మిక జెండా ఎగరవేస్తున్న విద్యుత్ శాఖ కార్మికులు

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు


బాగాయిపల్లి చౌరస్తాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల, మే 1: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం బాగాయిపల్లి, యాలాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. అమలు చేయలేని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏం చేస్తోందని విమర్శించారు. కల్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాన్ని సరిగ్గా అమలుచేయక మోసం చేస్తోందన్నారు. తాండూరు, యాలాల పరిసర ప్రాంతాల్లో కాగ్నావాగు నుంచి వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, వడ్డె రాములు, బసిరెడ్డి, కృష్ణకుమార్, అశోక్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్: ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. వికారాబాద్ మున్సిపాలిటీ జాంబాపూర్ తండాలో ప్రచారం నిర్వహించారు. ప్రజలు మరోసారి మోసపోకుండా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. కాళ్లాపూర్, రాపోల్, సయ్యద్‌పల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

'లీడర్ మారినా క్యాడర్ పోలేదు'

నవాబుపేట, మే 1: లీడర్ పార్టీ మారినా క్యాడర్ పోలేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కందాడ నాగిరెడ్డి అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీ పార్టీలో చేరిన వారు తమ సొంత ప్రయోజనాల కోసమే చేరారని తెలిపారు. ఎమ్మెల్యే యాదయ్య వారికి సముచిత స్థానం కల్పించినా నమ్మక ద్రోహం చేసి పార్టీ మారారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారన్నారు.

'ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి'

శామీర్‌పేట, మే 1: మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మజీద్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు తుంకి రమేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆ పార్టీకే ప్రజలు ఓటు వేస్తారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగవేస్తామని ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోడూరి నర్మద, భిక్షపతి, భాస్కర్‌గౌడ్, అబ్బగౌని ఎట్టయ్యగౌడ్, తుంకి స్వామి, టి. లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను అత్యధిక మెజారిటీతో గెలుపించాలి'

మేడ్చల్ టౌన్, మే 1: మాల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలుపించాలని డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి కోరారు. బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ బాసురగడీ, జ్గాపూర్‌లో ఆయన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో విజయం సాధించటం ఖాయమన్నారు. ఆమె విజయానికి కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. నాయకులు మాజీ సర్పంచ్ నరేందర్, నాయకులు దొడ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ ఆర్జీకేలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కీసర రూరల్, మే 1 : ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. బుధవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ రాజీవ్ గృహకల్ప(ఆర్జీకే) కాలనీలో కీసర పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరు ఉల్లంఘించినా సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకున్న పురపాలక వాసులు

- నాగారంలో రూ.5.02కోట్లు, దమ్మాయిగూడలో రూ.2.90 కోట్ల రాబడి


యజమాని నుంచి ఇంటి పన్ను స్వీకరిస్తున్న మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్

కీసర రూరల్, మే 1 : ముందస్తు చెల్లింపుల పథకం ద్వారా నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల ఖాతాలోకి భారీగా నగదు వచ్చి చేరింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను ముందస్తుగా చెల్లించిన వారికి ప్రభుత్వం ఐదు శాతం రిబేటు ఇచ్చింది. ఈ అవకాశాన్ని నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. నాగారం మున్సిపాలిటీలో రూ.5.02కోట్లు, దమ్మాయిగూడలో రూ.2.90కోట్ల మేర ఆదాయం సమకూరింది. నాగారంలో మొత్తం 19,259 వేల మంది ఇళ్ల యజమానులు ఉండగా అందులో 5,191 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. మొత్తం డిమాండ్‌లో 26.27శాతం ఆదాయం సమకూరి రాష్ట్ర స్థాయిలో 41వ స్థానంలో నిలిచింది. అదే విధంగా దమ్మాయిగూడలో మొత్తం 20,056 వేల మంది ఇళ్ల యజమానులు ఉండగా వారిలో 3,638 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.

అధ్యాపకుడు గణేష్ చక్రవర్తికి డాక్టరేట్



ఘట్‌కేసర్ రూరల్, మే 1:మండలంలోని అంకుశాపూర్ ఏస్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకుడు గణేష్‌చక్రవర్తికి డాక్టరేట్ లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో గల రాయసీమ వర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. 'మహిళా సాధికారిత- స్వయం సహాయక బృందాలు' అనే అంశంపై రీసెర్చ్ చేసి థీసిస్ సమర్పించారు. విశ్వవిద్యాలయ అధ్యాపకుడు ప్రొఫెసర్ పి.నాగరాజు ఆధ్వర్యంలో పరిశోధన చేశారు. డాక్టరేట్ పొందిన గణేష్ చక్రవర్తిని ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త కార్యదర్శి ఎం.పద్మావతి, ప్రిన్సిపల్ బీఎల్ రాజు అభినందించారు.

'చల్లాను గెలిపించాలి'

బొంరాస్‌పేట్/దోమ, మే 1: మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలం మెట్లకుంట, తదితర గ్రామాల్లో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యం అని, మే 13న ఎన్నికల్లో చెయ్యి గుర్తుకు ఓటేసి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న తాండూరు విజయ విద్యాలయం 1985-86 బ్యాచ్ విద్యార్థులు

తాండూరు, మే 1 : తాండూరులోని విజయ విద్యాలయ 1985-86 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరం నాటికి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ దుస్తులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు ప్రస్తుత, పూర్వ విద్యార్థులు విరాళాలు సేకరించేందుకు నిర్ణయించారు. అప్పటి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థి విద్యుత్ శాఖ హైదరాబాద్ ఏడీఈ శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, పూర్వ విద్యార్థులు వై.రమేష్, సి.ప్రవీణ్, ఆనంద్, చెన్ వీరయ్య తదతరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రిత్విక్‌రెడ్డి

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పూడూరు, మే 1 : పూడూరు మండలం తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ రాకంచర్ల పెంటయ్య ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కుమారుడు రిత్విక్‌రెడ్డి ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, నాయకులు పలువురు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో విన్నర్ జట్టుకు రూ.50వేలు, రన్నర్ జట్టుకు రూ.25వేలు అందించనున్నారు.

పోలింగ్ నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగిన ఉండాలి

పరిగి, మే 1: ఎన్నికల పోలింగ్ నిర్వహణ పద్ధతులపై సిబ్బంది, అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండా లని పరిగి అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎం.వాసుచంద్ర అన్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై బుధవారం జడ్పీహెచ్‌ఎస్‌నెం:01 పాఠశాలలో పీవో, ఏపీవోలకు జరిగిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. పోలింగ్ నిర్వహించే అధికారులు నియామవళి గురించి తెలుసుకోవాలన్నారు. పోలింగ్ సమయంలో విధులను అప్రమత్తతతో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, అధికారులు పాల్గొన్నారు.


పీవో, ఏపీవోల శిక్షణ శిభిరంలో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర

సంక్షిప్తంగా...

- **యాలాల:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బోయిని మమత అనే విద్యార్థిని బైపీసీలో 440కు 436 మార్కులు సాధించడం జరిగింది. తాండూరులోని తెలంగాణ రెసిడెన్షియల్ కళాశాలలో చదువుతున్న మమతను బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, మండల ప్రధాన కార్యదర్శి కె.కృష్ణకుమార్, నాయకులు లాలు తదితరులు పాల్గొన్నారు.
- **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ నాయకులు తమ పార్టీ అభ్యర్థి లక్ష్మారెడ్డి విజయం కోసం బుధవారం ప్రచారం చేపట్టారు. పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, మండల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల రవికుమార్, తుండం గణేష్, మహేష్ యాదవ్, నడికొప్పు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చీర్యాల్‌లో బ్రహ్మోత్సవాలు


మాట్లాడుతున్న ఆలయ కమిటీ నాయకులు

కీసర, మే 1 : ఈ నెల 3వ తేదీ నుంచి చీర్యాల్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ షోడశ(16)వ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మల్లారపు ఇందిరలక్ష్మీనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి పలు విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ.. స్వామి వారి గ్రామోత్సవం, కల్యాణం, సుదర్శన యాగం, చక్రతీర్థం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నా రు. నాలుగు రోజులు జరిగే ఉత్సవాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ న్యాయమూర్తులు, కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, హోదాలో ఉండే ప్రముఖులు విచ్చేయనున్నట్టు తెలిపారు. వీరితో పాటు జంట నగరాలు, చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యల్లో రానున్నారని లక్ష్మీనారాయణ తెలిపారు. వీఐపీలకు, సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన బారికేడ్లు, లైన్ల ఏర్పాట్లు చేశామని, మైదానం చదును, చలువ పందిళ్లు వేశావని తెలిపారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

దోమ, మే 1: మండలంలోని దొంగ ఎన్కెపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో మహేశ్‌బాబు పరిశీలించారు. ఎండలు విపరీతంగా ఉండటంతో కూలీలు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కూలి రూ.300 వరకు అందించడం జరుగుతుందని తెలిపారు. కొలతల ప్రకారం పనులు చేయాలని, కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి, సీనియర్ మేటీలకు ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ బాలయ్య, కార్యదర్శి దేవ్‌సింగ్, మేట్ సంజీవ్‌కుమార్, కూలీలు పాల్గొన్నారు.

తైక్వాండో ఫెడరేషన్ సర్టిఫికెట్ అందుకున్న విద్యార్థిని


వర్ధినికి సర్టిఫికెట్ అందజేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు, మే 1: చేవెళ్ల మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా తాండూరు పట్టణంలోని ఎంపీటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వరల్డ్ తైక్వాండ్ ఫెడరేషన్ సర్టిఫికెట్‌ను తాండూరుకు చెందిన క్రీడాకారిని వర్ధిని అందుకున్నారు. మూడు సంవత్సరాల నుంచి మాస్టర్ మనోహర్ వద్ద శిక్షణ పొందింది. వరల్డ్ తైక్వాండో ఫెడరేషన్ కొరియా సర్టిఫికెట్ పొందారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, క్రీడాకారిని వర్ధినిని మాస్టర్లు మనోహర్, కుశాల్ ఘనంగా సన్మానించారు. విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మనోహర్ ఆధ్వర్యంలో శిక్షణ పొంది వరల్డ్ తైక్వాండో ఫెడరేషన్ కొరియా సర్టిఫికెట్ పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్‌కుమార్, కౌన్సిలర్ శ్రీలత, లలిత, శివకుమార్, బస్వరాజ్ పాల్గొన్నారు.

'లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాన్ని ఉధృతం చేయాలి'

వికారాబాద్, మే 1 : బీజేపీ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాన్ని ఉధృతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.గీత అన్నారు. బుధవారం మే డే సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నరేంద్రమోదీ పాలనలో పరిశ్రమల మూతపడి కార్మికుల రోడ్డున పడ్డారన్నారు. కనీస వేతనాలు కరవయ్యాయని, పోరాటాలతో సాధించుకున్న 44కార్మిక చట్టాలను కోడ్‌లుగా కుదించి కార్మికులను బానిసలుగా చేసే కుట్రకు వడిగట్టిందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయకులు గోపాల్ శ్రీకాంత్ ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు రాములు బసిరెడ్డి సత్తయ్య ప్రభావతి లక్ష్మమ్మ వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేటి లోగా సప్లిమెంటరీ ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

వికారాబాద్, మే 1 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు మే 2తేదీ లోగా పరీక్ష ఫీజు సంబంధిత కళాశాలలో చెల్లించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎన్.శంకర్ తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు, సబ్జెక్టు ఇంప్రూవ్‌మెంట్ రాసేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

రెయిలింగ్‌కు ఢీకొన్న బైక్.. వ్యక్తి దుర్మణం


మృతుడు దశరథ్

పరిగి, మే 1: అతి వేగంతో బైక్ రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పరిగి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన చాకలి దశరథ్ (49) బుధవారం బైక్(టీఎస్34ఈ 4056)పై పరిగికి వస్తుండగా చింతలచెరువు మలుపులో రోడ్డు పక్కన ఉన్న స్టీల్ రెయిలింగ్‌ను వేగంగా ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలైన దశరథ్‌ను స్థానికులు పరిగి ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. దశరథ్ భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

కారు-ద్విచక్ర వాహనం ఢీ.. ఒకరి మృతి

రాయపోల్, మే 1 : కారు-ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం కిష్టాసాగర్ వద్ద చోటుచేసుకుందంఇ. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా రాజబొల్లారానికి చెందిన కోట బాబుశేఖర్ తన భార్యాపిల్లలతో బుధవారం ఉదయం కారులో రాయపోల్ వచ్చాడు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో రాయపోల్ మండలం కృష్ణసాగర్ వద్దకు రాగా అదే సమయంలో కీసర మండలం బండ్లగూడకు చెందిన కట్టా ప్రేమ్‌కుమార్, కుంభదేవ్ ద్విచక్ర వాహనంపై గజ్వేల్ నుంచి రాయపోల్ వైపు వస్తున్నారు. బైక్, కారు ఢీకొనడంతో బైక్ వెనక కూర్చున్న కుంభదేవ్(35) ఎగిరి కారుపై పడి కిందపడ్డాడు. దీంతో అతని కాలు నుజ్జునుజ్జు అయ్యింది. చెయ్యి విరిగి అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్ర వాహనం వేగంగా రాంగ్ రూట్లో వచ్చి కారును ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుందని, బాబుశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘుపతి తెలిపారు.

వాహనం ఢీకొని చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, మే 1:మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్‌లోని శ్వేత ఆసుపత్రి వద్ద జాతీయ రహదరిపై గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొంది. క్షతగాత్రుడ్ని చికిత్స నిమితం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణిచాడు. మృతుడి వయసు 40-45 సంవత్సరాల మధయ ఉంటుందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జారిపడి గాయాలపాలైన వృద్ధురాలు..

తాండూరురూరల్, మే 1: జారిపడి గాయాలతో చికిత్సపొందుతూ ఓ వృద్ధురాలు మృతిచెందింది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిరిగిరిపేట్‌కు చెందిన అమృతమ్మ(60) గత నెల 19న కల్లుతాగిన మైకంలో ఇంట్లో బ ాత్‌రూంలో కాలు జారి పడింది. ఆమెను కుటుంబీకులు తాండూరు ప్రభుత్వ జి ల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అమృతమ్మ మృతిచెందింది. తన భార్య ప్రమాదవశాత్తు పడి మృతిచెందిందని భర్త రాములు చెప్పారని ఎస్సై తెలిపారు.

మృతురాలు చంద్రవంచ వాసిగా గుర్తింపు

తాండూరురూరల్, మే 1 : మండల పరిధి చంద్రవంచ శివారు వాగులో లభ్యమైన మహిళ మృతదేహం ఆచూకీ లభ్యమైంది. మృతురాలు చంద్రవంచకు చెందిన అనితగా పోలీసులు గుర్తించారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని జట్టూరుకు చెందిన అనితకు చంద్రవంచకు చెందిన బోయిని లక్ష్మప్పతో 14ఏళ్ల వివాహమైంది. లక్ష్మప్ప తాగుడుకు బానిసై అనితను వేధిస్తున్నాడు. రెండు రోజుల నుంచి అనిత కనిపించడం లేదు. మంగళవారం సాయంత్రం చంద్రవంచ శివారులోని కాగ్నా నదిలో ఆమె మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. అనితను భర్త లక్ష్మప్పే గొం తుకోసి హత్య చేసి, వాగులో పడేశాడని అనిత తండ్రి నాయికోటి తుల్జప్ప ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తికి గాయాలు

తాండూరు రూరల్, మే 1: బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఓగీపూర్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని గుల్బర్గ జిల్లా ఎన్.వెంకటాపురం గ్రామానికి చెందిన వెంకట్‌రాములు(45) గనుల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం వెంకట్‌రాములు మరో వ్యక్తితో కలిసి బైక్(ఏపీ22క్యూ2784)పై ఓగీపూర్‌కు వెళుతున్నాడు. సాగర్‌సిమెంట్ ఫ్యాక్టరీ మెయిన్ రోడ్డు వద్ద ఒక లారీ(ఏపీ16 టీక్యూ1818) బైక్‌కు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న వెంకట్‌రాములు, తుల్జారామ్‌లకు గాయాలయ్యాయి. వెంకట్‌రాములు తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అతడి సోదరుడు ఆశప్ప ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ లక్ష్మయ్యపై కేసు చేశామని ఎస్సై తెలిపారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

కీసర రూరల్, మే 1:పేకాట ఆడుతున్న ఐదుగురిని బుధవారం కీసర పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కీసర ఎస్సైలు శ్రీనివాస్‌రెడ్డి, మధు మండలం భోగారంలో పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పారిపోయినట్టు తెలిపారు. వారి నుంచి రూ.30వేలు, రెండు కార్లు, మూడు బైక్‌లు, ఐదు ఫోన్లు, ప్లే కార్డ్‌సెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

గొర్రె పొట్టేళ్ల పందెం నిర్వాహకులు ...

మూడుచింతలపల్లి, మే 1 : గొర్రె పొట్టేళ్ల పందెం నిర్వహిస్తున్న వారిని అరెస్ట్ చేసిన సంఘటన శామీర్‌పేట్ మండలంలో మంగళవారం జరిగింది. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో కొందరు గొర్రె పొట్టేళ్ల పందాలను నిర్వహిస్తున్నానే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు పొట్టేళ్లు, 2ఆటోలు, 8 మందిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు రూ.27 వేలు వరకు జరిగినట్లు, 5సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.